ప్రజాశక్తి
మంగళవారం 17 జూన్ 2025
5
విజయనగరం

నేడు ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

రానే మద్రాస్ లిమిటెడ్, హైదరాబాద్ వారు మంగళవారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను ఐటిఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2024 సంవత్సరంలో ఐటిఐ పాస్ అయిన వారు, 2025 సంవత్సరం ఆగస్టులో పరీక్షలకు హాజరు కాబోయే చివరి సంవత్సర అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ ట్రేడ్లు చదివేవారు అర్హులు అన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో రావాలన్నారు. ఇతర వివరాలకు 810 60 25 022, 98499 44 654 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- జిల్లాలో మూడు కరోనా కేసులు నమోదు
- రోగులతో ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులు కిటకిట

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో వర్షాలు ప్రారంభం కావడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీనికి తోడు కరోనా కేసులు కూడా నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. వాతావరణం వచ్చిన మార్పులతో ఒక్కసారిగా జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. జ్వరాల రోగులు కొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరుతుంటే మరి కొందరు ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. జ్వరాల్లో మలేరియా జ్వరంతో ఎక్కువ మంది బాధపడుత్యున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఉన్న జనరల్ మెడికల్ వార్డులు జ్వరాలతో నిండి పోతున్నాయి. జ్వరంతో ఈ నెల 10న రామభద్ర పురం మండలం జాన్నివలస పంచాయతీ మెట్టవలసకు చెందిన పదో తరగతి విద్యార్థి మేఘన మృతి చెందింది.

సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

నాలుగు నెలలు పాటు తీవ్రమైన ఎండలు కాచి ఒక్క సారిగా చల్లబడడం, నీరు కలుషితం కావడంతో వైరల్ జ్వరాలు ప్రభలుతున్నాయి. కాలువలో పూడికలు తీయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలకు కారణమవుతున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాలో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు ను తాగాలని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో మూడు కరోనా కేసులు నమోదు

ఒక వైపు జ్వరాలతో పాటు కరోనా కూడా ప్రజలను భయపెడుతోంది. జిల్లాలో ఇటీవల బాడంగి, నెల్లిమర్ల, విజయనగరంలో మూడు కేసులు పాజిటివ్‌గా నమోదయ్యాయి. ప్రజలకు కరోనా లక్షణాలు ఉంటే వారి నమూనాలను సేకరించి విశాఖపట్నంకు పంపిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో కరోనా రోగులకు వార్డు కేటాయించారు.

సర్వజన ఆసుపత్రి, ఘోషాలో ఒపి వివరాలు (సుమారు)

తేదీ	ఓపి సంఖ్య
జూన్ 10	923
జూన్ 11	1222
జూన్ 12	1251
జూన్ 13	1133
జూన్ 14	972
జూన్ 15	127

జిల్లా వ్యాప్తంగా గత మూడేళ్లగా నమోదైన మలేరియా కేసులు

సం.	టెస్టులు.	మలేరియా
2023	2,45,712	439
2024	4,22,573	805
2025	1,34,004	222

జిల్లా కేంద్రాస్పత్రిలో ఒపి టిక్కెట్ కౌంటర్ వద్ద రోగుల రద్దీ

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. ఆసుపత్రుల్లో మందులు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు జ్వరాలు, కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి. కరోనా టెస్టులు చేయిస్తున్నాం. జిల్లాలో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా లక్షణాలు ఉన్న వారి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నాం.

-ఎస్.జీవన్ రాణి, డిఎంహెచ్ఒ

పిజిఆర్ఎస్‌కు 188 వినతులు

ప్రైవేటు పాఠశాలల్లో వెంటనే ఉచిత సీట్లు కేటాయించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్, విజయనగరంటౌన్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ వారం 188 వినతులు వచ్చాయి. కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ , డిఆర్ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల గాంధీ, విజయనగరం ఆర్‌డిఒ సవరమ్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 68 వినతులు అందాయి. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని దేశించారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 188 వినతులు అందాయి.

యోగాంధ్ర కార్యక్రమానికి సిద్ధం చేయాలి

ఈనెల 21 న విశాఖపట్నంలో ప్రధాని మోడీ ఆధ్వర్యం లో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా నుండి 30 వేల మంది యోగాభ్యాసకులను సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, ఇంజినీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్, డిగ్రీ తదితర కళాశాలల నుండి 15వేల మంది విద్యార్థులను సమీకరించాలని, డిఆర్‌డిఎ, మెప్మా ల ద్వారా మరో 15వేల మందిని సమీకరించాలని తెలిపారు. అదేరోజు జిల్లా స్థాయిలో 6500 వేదికలలో నిర్వహించే యోగాసనాలకు ఎంపిడిఒలు బాధ్యత తీసుకొని, విజయవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో వెంటనే ఉచిత సీట్లు కేటాయించాలి

ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో పేదలకు ఉచితంగా కేటాయించవలసిన సీట్లను ఆయా యాజమాన్యాలు తక్షణమే కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఉచితంగా పేదలకు కేటాయించవలసి ఉండగా స్థానిక ఫోర్ట్ సిటీ, సన్ స్కూల్, బీసెంట్, చాణిక్య పాఠశాలల్లో ఇంకనూ కేటాయించలేదని, తక్షణమే ఆయా యాజమాన్యాలు కేటాయించాలని, లేని యెడల వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం వినతులు విభాగంలో తల్లిదండ్రుల నుండి ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ పైవిధంగా స్పందించారు. ఈ నాలుగు పాఠశాలల ద్వారా 240 సీట్లు కేటాయించవలసి ఉందని, వాటిని వెంటనే కేటాయించాలని ఆదేశాలు జారీచేయాలని డిఇఒ మాణిక్యం నాయుడుకు కలెక్టర్ సూచించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిఆర్ఒకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, దీనిలో భాగంగా బిపిఎం హైస్కూల్లో నీటి సదుపాయం సరిగ్గా అందకపోవడం, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, గ్రౌండ్ సదుపాయం సరిగ్గా లేకపోవడం ఇలాంటి సమస్యలు గుర్తించామని తెలిపారు. గాజులరేగ గర్ల్స్ హైస్కూల్ కు సంబంధించి భవన నిర్మాణం పూర్తి చేయలేదని, కంటోన్మెంట్ హై స్కూల్లో తాగునీటి సదుపాయం సరిగ్గా లేదని తెలిపారు. ఇలా ప్రతి పాఠశాలలోనూ సమస్యలు పేరుకుపోయాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు గుణ ,శివ ,లోహిత్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎఎస్‌పి

బాధితుల సమస్యలను తక్షణమేపరిష్కరించాలని పోలీసు అధికారులను ఎఎస్‌పి పి.సౌమ్యలత ఆదేశించారు. జిల్లాపోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 46 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుండి అదనపు ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్ , సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్కాస్‌లో ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనం తో పాటు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నేతగా చంద్రబాబు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించరాని కానీ అందుకు బిన్నంగా ప్రభుత్వ విధానం ఉందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనం తో పాటు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ రామనాయుడు, ఎస్ రాజు, చిన్న, దుర్గారావు, సూరి , చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలి

జిల్లాలో వేదాంత ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వలన విపరీతమైన భారాలు వేసి, డ్రైవర్లకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే బ్రేకు, రెన్యూవల్ సొల్యూషన్ ప్రభుత్వమే చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్లు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా కనక దుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కె.సురేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్రను వెంట అమలు చేయాలని, పోలీసులకు ఆటో స్టాండ్లకు వెళ్లి 336 సెక్షన్ కింద ఆటో డ్రైవర్ల పై బలవంతంగా అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆటో డ్రైవర్ల పై పెట్టిన అక్రమ కేసులు బేసరత్తుగా రద్దు చేయాలన్నారు. డిగ్రీలు చదువుకున్నా ఉపాధి లేక స్వయం ఉపాధిగా బతుకుతున్న ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు రంగాన్ని సర్వీస్ రంగంగా గుర్తించాలన్నారు. డ్రైవర్లను అదుకోవాల్సిన పాలకులు జలగల్లా పీల్చుకు తింటున్నారని తెలిపారు. డ్రైవర్లపై అక్రమంగా పెడుతున్న కేసులు ఎత్తివేయాలని, డ్రైవర్లతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫీజులు, పెనాల్టీలు జీవో నెంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఆటో కార్మికులు సిహెచ్.ముత్యాలు, పి వి నారాయణరావు, ఎస్.సత్యన్నారాయణ, వై.వెంకటరావు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

97 మందికి ఉద్యోగోన్నతులు

3594 మంది ఉపాధ్యాయులకు బదిలీ

డిఇఒ మాణిక్యం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో 97 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించామని, 3594 మందికి బదిలీలు చేయాలని డిఇఒ మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగోన్నతులు గ్రేడ్ 2 హెచ్‌ఎం 48 మందికి, స్కూల్ అసిస్టెంట్ లు బయోలాజికల్ సైన్స్ 11 మందికి, సోషల్ 1, ఎస్ఎ తెలుగు 2, హిందీ 6 , ఫిజికల్ సైన్స్ 13, పిఎస్ హెచ్‌ఎం 16, మొత్తం 97 మందికి ఉద్యోగోన్నతులు ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు కౌన్సిలింగ్ ద్వారా హెచ్ ఎం గ్రేడ్ 2- 69, ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం 275, స్కూల్ అసిస్టెంట్లు కలిపి 1345, ఎస్జీటీ లు 1816, పిఇటిలు 26, భాషా పండితులు 60, ఆర్ట్, డ్రాయింగ్ కలిపి ముగ్గురు ఉపాధ్యాయులకు బదిలీ అయినట్లు తెలిపారు.

ఈ అవార్డు ప్రజలకు అంకితం

డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తనకు లభించిన ఇండియన్ ఐకానిక్ అవార్డు ప్రజలందరికీ అంకితమని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు, రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైమ్స్ ఆఫ్ ఇండియా వారు విశిష్టమైన వ్యక్తులకు ఇండియన్ ఐకానిక్ అవార్డ్స్ 2025 సంవత్సరానికి హైదరాబాదులో నిర్వహించిన వేడుకల్లో ప్రదానం చేశారని తెలిపారు. పీడియాట్రిక్, ఫిలంత్రోపి విభాగంలో చేసిన సేవలకుగాను ఈ అవార్డు తనకు లభించిందన్నారు. జిల్లా రోటరీ గవర్నర్‌గా, ప్రిడియాట్రిషన్‌గా సమాజంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. 9 నుండి 14 సంవత్సరాలు ఆడపిల్లలు ఎవరైతే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారో వారందరికీ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ (సర్వేకల్) రాకుండా వ్యాక్సిన్‌ను ఉచితంగాఇస్తున్నట్లు తెలిపారు. ముందుగానే వ్యాక్సిన్ తీసుకున్నట్లయితే వ్యాధిని అరికట్టవచ్చునని తెలిపారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న న్యాయవాది సత్యం

ఎపిపిగా గేదెల సత్యం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎపిపి)గా విజయనగరానికి చెందిన న్యాయవాది గేదెల సత్యం నియమితులయ్యారు. ఈమేరకు డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ వారు ఇచ్చిన ఉత్తర్వుల కాపీని ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి విజయ కల్యాణికి సోమవారం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. సత్యం గత 20ఏళ్లగా జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. డిఎల్ఎస్ఎ మెంబరుగా బాధితులకు అండగా నిలిచి అనేక కేసులను వాదించారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో నైపుణ్యం కనబరిచారు. ఉచిత న్యాయసహాయ కౌన్సిల్‌గా పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించారు. ఈనేపథ్యంలోనే ఆయనను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు అభినందించారు. ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తాటిపూడి రైతుల భవిష్యత్తును తాకట్టుపెట్టొద్దు

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గులిపల్లి లలిత

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడిరైతుల భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దని, జీవో ఎంఎస్ 14ను రద్దు చేయాలని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్‌పర్సన్ గులిపల్లి లలిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బొడ్డవర వద్ద అల్యూమినియం ఫ్యాక్టరీకి తాటిపూడి నీటిని తరలించే విషయమై వైసిపి ప్రభుత్వం గతంలో జీవో తెచ్చిందని, అల్యూమినియం ఫ్యాక్టరీ తాటిపూడికి నీరు విడుదల చేయడానికి వీలు లేదని రైతులు ఆందోళన చేయడంతో నిలుపుదల చేశారని పేర్కొన్నారు. తాజాగా చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అల్యూమినియం ఫ్యాక్టరీని ఎంఎస్‌ఎంఇ పరిధిలోకి తీసుకొచ్చారని, ఇది పూర్తిగా ప్రైవేటు పరం కావడం వల్ల 180 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిని కలిపి, ఇది ప్రభుత్వ రంగ సంస్థగా నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తాటిపూడి నీటిని అల్యూమిని ఫ్యాక్టరీకి కేటాయించడాన్ని రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

మండల వ్యాప్తంగా సోమవారం రైతు సేవాకేంద్రం వద్ద వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ పలు గ్రామాల్లో పర్యటించి విత్తనాల పంపిణీ, సుడోమోనస్ పని తీరుపై రైతులకు అవగాహన కల్పించారు. పురిటిపెంట, శ్రీరంగరాజపురం రైతుసేవాకేంద్రాల్లో పలువురు రైతులతో మాట్లాడుతూ విత్తనాలు నారు పోయటం కానీ, యదచల్లటం కానీ చేసినప్పుడు ముందుగా వరి విత్తనాలతో పాటు సుడుమోనస్ విత్తన శుద్ధి పౌడర్ విధిగా చేయాలన్నారు. కోరారు. రైతు సేవా కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తప్పకుండా తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు వినయ్, వాసవి పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగా వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం సర్వజన ఆస్పత్రి వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ పట్ల చైతన్యవంతులై ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఒ సింహాచలం, ఆయుష్ అధికారి ఆనందరావు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రహదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టవద్దు

ఖాళీ స్థలాలను, రహదారులను ఆక్రమించి ఎట్టి నిర్మాణాలను చేపట్టరాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఇందిరానగర్ లో గుర్తించిన కొన్ని తాత్కాలిక ఆక్రమణలను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా అక్రమ నిర్మాణాలు, అనధికార కట్టడాలను ఉపేక్షించబోమని చెప్పారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటం

ప్రజాశక్తి - చీపురుపల్లి

మోసపూరిత హామీలతో ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వ పాలన పనితీరును ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజల పక్షాన వైసిపి నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సోమవారంవైసిపి కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో కలిసి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం.. అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలను గుమ్మరించిన కూటమి పాలకులు ప్రస్తుతం కంటి తుడుపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. గతంలో అమ్మ ఒడి డబ్బులు నుండి పాఠశాల అభివృద్ధి కోసం వెయ్యి రూపాయలను మినహాయిం చినప్పుడు తప్పుడు ఆరోపణలు చేసిన ప్రస్తుత కూటమి నాయకులు 2000 రూపాయల కోతను ఎందుకు విధిస్తుందంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, ఎస్‌వి రమణ రాజు, కోట్ల విశ్వేశ్వరరావు, మీసాల విశ్వేశ్వరరావు, పొట్నూరు సన్యాసినాయుడు, కెవి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై ముద్రించిన పుస్తకాన్ని తన క్యాంపు కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన విధ్వంస పాలన గూర్చి పుస్తకంలో పొందుపరిచా మన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జామి వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి, మాజీ ఎంపిపి శివ, కొత్తవలస, ఎల్‌కోట, వేపాడ ఎంపిపిలు నీలం శెట్టి గోపమ్మ, గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, నాయకులు బొంతల వెంకటరావు, పళ్ళ భీష్మ, ఎంపిటిసి వెలగల రమణ పాల్గొన్నారు

బొబ్బిలి: స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ ప్రచురించిన పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనను ప్రజలు వైయస్ జగన్ ఏడాది పాలనతో పోల్చి చూస్తున్నారని, వైయస్ జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అని ప్రజలే చెబుతున్నారని అన్నారు.

గజపతినగరం రూరల్: కూటమి మోసాలపై వెన్నుపోటు పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను, యువతను మోసం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గారతౌడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, కరణం ఆదినారాయణ, మండల సురేష్, బెల్లాన త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : అధికారంలోకి వస్తే చేసిన వాగ్ధానాలన్నీ అమలు చేస్తానని చెప్పి ఏడాది పాలనలో ప్రజలను నమ్మించి మోసగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు టిడిపి, బిజెపి, జనసేన కూటమి పేరిట ప్రజలకు అసత్య వాగ్ధానాలు చేసి నమ్మించి మోసగించటం దుర్మార్గమని పేర్కొన్నారు. సోమవారం కోలగట్ల నివాసంలో పార్టీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిందని, హామీల అమలుపై ప్రశ్నించే గొంతుకులను నొక్కేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో ఈనెల 23 నుంచి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసేందుకు సిద్ధమవుతుందని, ఈనేపథ్యంలో ఎన్నికలకు ముందు నమ్మి ఓట్లేసి మోసపోయిన ప్రజలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాధ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, జిల్లా కార్యదర్శి దుప్పాడసునీత తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో జెడ్‌పి చైర్మన్

'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

చిట్టిబాబుకు బార్ అసోసియేషన్ అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

భారతరత్న సి సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు గ్రహీత పెంకి చిట్టిబాబును జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె రవిబాబు మాట్లాడుతూ నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వారు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన భారత రత్న 'సి సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు' ను చిట్టిబాబు అందుకోవడం న్యాయవాదులకు గర్వకారణమని అన్నారు. బాధితులు సాక్షుల పక్షాన నిలబడి పేదలకు సహాయం చేసే ఆయన నిర్విరామ కృషికి ఈ అవార్డు అద్దం పడుతోందని అన్నారు. సీనియర్ న్యాయవాది బెల్లాన రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు చేస్తున్న కృషిని అభినందించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గేదెల సత్యం మాట్లాడుతూ దళితులు, గిరిజనులు , మహిళలు, బాలలు, గృహ కార్మికులు, హక్కుల పరిరక్షణకు నిరంతరం శ్రమించే శ్రామికుడు అని కొనియాడారు. అవార్డు గ్రహీత పి చిట్టిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల అమలు కోసం పనిచేస్తున్న వ్యక్తులను అభినందించి, ప్రోత్సహించిన బార్ అసోసియేషన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్స్ బార్ సెక్రటరీ ఎన్ సురేష్, ఉపాధ్యక్షులు పి శివప్రసాద్ , సీనియర్ న్యాయవాదులు ఐ.సురేష్, సిహెచ్ దామోదర రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని కోరుతూ గిరిజనులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలోని 40 శాతం గిరిజన గ్రామాలు ఉన్నాయని, అవి ఐడిడిఎ పరిధిలో లేకపోవడంతో ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందడం లేదని అన్నారు. నిరుపేద గిరిజనులకు భూపట్టాలు పంపిణీ విషయంలో జాప్యం చేస్తున్నారని, గతంలో నిరుపేదలకు భూములు ఇవ్వాలని సర్వే నిర్వహించి సుమారు 1500 మందికి భూపట్టాల పంపిణీ చేయలేదన్నారు. గిరిజన గ్రామాలను ఐటిడిఎ పరిధిలోకి తీసుకున్నట్లయితే గిరిజనులకు అందాల్సిన సంక్షేమ ఫలాలతో పాటు ప్రత్యేక గిరిజన నిధులు కూడా అందుతాయన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ అరుణకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల శాఖ కార్యదర్శి తామరపల్లి సోములు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో 'యోగాంధ్ర'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, ఉప ఎంపిడిఒ జి.శంకర్ జగన్నాథ్, ఇఒపిఆర్‌డి పి.సుదర్శనం, ఎపిఒ సి.హెచ్. రామారావు, ఎపిఎం సురేష్‌కుమార్, ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, యోగా గురువులు, పైడిరాజు, విజయ్ భాస్కర్, ఆర్గనైజర్ డాక్టర్ సుమలత, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది , ఫీల్డు అసిస్టెంట్ లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంలో..

విజయనగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా సీతం కాలేజి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఓపెన్ ఆడిటోరియంలో సోమవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను వారి దైనందిన జీవితంలో సమగ్రంగా చేర్చుకోవాలని ప్రోత్సహించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌విఎస్ రాజు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

ఇద్దరు ఎఒలకు అభినందనలు తెలుపుతున్న విఎఎలు, సిబ్బంది

కొత్త ఎఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నూతన మండల వ్యవసాయధికారిగా పి.శ్రీలక్ష్మి సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె విజయనగరం భూసార పరీక్ష కేంద్రం నుంచి బదిలీపై ఎఒగా ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎఒగా బాధ్యతలు నిర్వహించిన ఎం.పూర్ణిమ బదిలీపై జామి వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎఒలు శ్రీలక్ష్మిని, ఎం.పూర్ణిమను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు హరికృష్ణ, రూప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో మంగళశారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి. త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు నెల్లిమర్ల సబ్ స్టేషన్ 33/11కెవి పరిధి గుర్ల 11కెవి రూరల్ ఫీడర్ మీద వ్యవసాయం కనెక్షన్ పనులు కొనసాగింపు, చెట్టు కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం గరికిపేట, కొండగుంపాం, పూతిక పేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదలకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఆదుకోవాలని బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణరావు, చెన్నా ధర్మ డిమాండ్ చేశారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అర్బన్ ఏరియాలో నివశించేవారికి 2 సెంట్లు, రూరల్ ఏరియాలో నివశించే వారికి 3 సెంట్లతో పాటు 5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేస్తామని ప్రకటించారని తెలిపారు. అందులో భాగంగానే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30వ వార్డు, ధర్మపురి సర్వే నెం. 86/1,2,3,4,5 గయాలులో 3.77 సెంట్లు భూమిని 22ఎ లోకి తీసుకొని 2007లో రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసిందన్నారు. వెంటనే ఆ భూమిని 22ఎ నుండి తొలగించి బడుగు బలహీన వర్గాల వారికి వెంటనే ఇళ్ల స్థలాలపట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, కల్వర్టులు నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు శంకుస్థాపన చేశారు. 15వ వార్డు గొల్లవీధి కృష్ణుడు గుడి దగ్గర రూ.5లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సిసి డ్రైన్‌కు, 21వ వార్డు నాయుడు కాలనీలో సుమారు రూ.5 లక్షలతో సిసి రోడ్లు, కల్వర్టులు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి పురపాలక సంఘాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. శంకుస్థాపన చేసిన పనులు అన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వర రావు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న విఆర్ఎ సంఘం నాయకులు

విఆర్‌ఎల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మెరకముడిదాం

విఆర్ఎల మండల మహాసభలు సోమవారం మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి మండలాల్లో జరిగాయి. ఈ సందర్భంగా మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈ సభల్లో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఆర్ఎ వ్యవస్థను బలహీన పరుస్తోందన్నారు. సంఘాన్ని విచ్ఛిన్నం చేసి అనైక్యతను సృష్టించి, లబ్ధి పొందాలని చూస్తున్న ప్రభుత్వాలకు మన బలం ఏంటో చూపించాలని తెలిపారు. సమస్యలపై వచ్చేనెల 9న చేపట్టే సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెరకముడిదాం మండలం అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రామప్పుడు, భాస్కర్, ఆదినారాయణ, పైడియ్య, గరివిడి అధ్యక్షుడు లక్ష్మణ, రాములుతో పాటు ఆయా మండలాల విఆర్ఎలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలి

ప్రజాశక్తి - భోగాపురం

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని జనసేన పార్టీ భోగాపురం క్లస్టర్ ఇంచార్జ్ పల్లంట్ల జగదీష్ అన్నారు. భోగాపురంలోని పార్టీ కార్యాలయంలో పంచాయతీ పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ రాణించాలంటే పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. సీనియర్ నాయకులు పడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పళ్ళ రాంబాబు, వరుపుల సుధాకర్, జక్కపు రవి తదితరులు పాల్గొన్నారు.

నాడు అనుమతులు.. నేడు ఆందోళనలు

◆ వైసిపి నాయకుడి తీరు ◆ జనసేన నాయకుడి పోరుపై విమర్శలు ◆ కోళ్ల ఫారాన్ని ఎత్తివేయాలని తారా స్థాయికి ఆందోళన

మండలంలోని బిరసాడవలస గ్రామం వద్ద ఉన్న కోళ్ల ఫారం తొలగించాలని డిమాండ్ చేస్తూ కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఆందోళన కొనసాగుతోంది. అయితే కోళ్ల ఫారం ఏర్పాటుకు కొన్నేళ్ల క్రితం అనుమతులు ఇచ్చిన స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పుడు తొలగించాలని ఆందోళన చేయడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.ఏదేమైనా కోళ్ల ఫారాన్ని ఎత్తివేసే వరకు ఆందోళన కొనసాగుతుందని పలు పార్టీల నాయకులు తేల్చి చెబుతున్నారు.

నిరసన తెలుపుతున వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి - మెంటాడ

బిరసాడవలస కోళ్ల ఫారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ దాదాపు నాలుగు గ్రామాల ప్రజలు కొద్దిరోజులుగా దాని ఎదుట ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట కూడా నిరసన తెలిపారు. 2017లో జయతి పంచాయతీ శివారు గ్రామమైన బిరసాడవలసవద్ద కోళ్ల ఫారం ఏర్పాటుకు అప్పటి హెల్త్ డిపార్ట్మెంట్, పొల్యూషన్ అధికారులు కూడా అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో అప్పటి సర్పంచ్ బి.వీరునాయుడు ఆధ్వర్యంలోని పంచాయతీ పాలకవర్గం కూడా అనుమతులు మంజూరు చేసింది. 2021 ఎన్నికల్లో అప్పటి సర్పంచ్ భార్య సర్పంచుగా ఎన్నికయ్యారు. 2017లో అనుమతి ఇచ్చిన నాటి సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ ఇప్పుడు ఆ కోళ్ల ఫారానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటిస్తూ అడపాదడపా పాల్గొంటున్నారు. దీనిపై స్థానికులు ఆసక్తిగా చర్చించు కుంటున్నారు.రాజకీయ లబ్ధి ఎజెండాగా సదరు నాయకులు ఆడుతున్న హైడ్రామాపై స్థానికులు మండిపడుతున్నారు. ఇలా ఉండగా, జనసేన మండల నాయకుడిగా చెప్పుకొనే రాజశేఖర్ అనే వ్యక్తి ఆందోళనను ముందుండి నడిపిస్తుండగా, ఆపార్టీ నాయకులు గానీ కార్యకర్తలు గానీ అటువైపు కన్నెత్తి చూడడంలేదు. అది రాజశేఖర్ వ్యక్తిగత ఆందోళన అని, కేడర్‌ని కనీసం సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నప్పుడు తాము ఎలా పాల్గొంటామని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే, కోళ్ల ఫారం నుంచి వెలువడుతున్న దుర్వాసన కొంతవరకు తగ్గిందని, మోటారు పాడైనందునే దుర్వాసన వచ్చిందని, మోటార్ బాగుచేయించి దాన్ని నిలువరించామని కోళ్ల ఫారం యజమానులు, అందులో పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. కోళ్ల ఫారం మూసేయాలని కొందరు ఆందోళన చేస్తుండగా, కోళ్ల ఫారం మూసేస్తే, సుమారు రెండువందల కుటుంబాలు రోడ్డున పడతాయని సిబ్బంది అంటున్నారు. మొత్తంమ్మీద, అప్పట్లో అనుమతులు ఇవ్వడమే కాకుండా స్థల సేకరణలో భాగస్వామ్యం అయిన అప్పటి సర్పంచ్ ఇప్పుడు ఆందోళన చేస్తుండడం, కేడర్‌ను కలుపుకొనిపోకుండా జనసేన పార్టీపేరు చెప్పి రాజశేఖర్ వ్యక్తిగతంగా ఆందోళన చేపట్టడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని ఒక వర్గం భావిస్తుంది. మండల కమిటీ ఏర్పాటు కాలేదని అయినా రాజశేఖర్ మండల పార్టీ అధ్యక్షుడుగా చలామణి అవుతుండడాన్ని జనసేనలో మిగిలిన సీనియర్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ప్రజల తరుపున పోరాడుతున్నామని, అందుకే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు కోరినట్లు చెబుతున్నారు. తమపై గిట్టనివారు ఆరోపణలు చేస్తుంటారని రాజశేఖర్ కొట్టిపారేశారు.

కోళ్ల ఫారాన్ని ఎత్తివేయాల్సిందే..

కోళ్లఫారం వల్ల దుర్గంధం రావడంతో ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి, టిడిపి, జనసేన, సిపిఎం నాయకులు మూకుమ్మడిగా ధర్నాలు, నిరసనలు చేపట్టడంతో కార్యక్రమం తారాస్థాయికి చేరింది. దుర్గంధం వల్ల మెంటాడ, చింతలవలస, కైలాం, జయతి, అమరాయివలస, బిరసాడవలస గ్రామాల ప్రజలు ముక్కు మూసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తమకు కోళ్ల ఫారం వద్దని తాజాగా ఆటోలపై ప్రచారం చేపట్టారు. కోళ్లఫారంవల్ల పలు రోగాలకు గురవుతున్నామని ఈ ఉద్యమం కోళ్ల ఫారం మూతబడే వరకు కొనసాగుతుందని నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ పోరాటంలో ప్రాణాలను సైతం వదులతాం కాని కోళ్ల ఫారం మూతబడే వరకు పోరాటం మాత్రం ఆపమని బాధితులు, నాయకులు చెబుతున్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక కోటలో సోమవారం ఎమ్మెల్యే బేబినాయన నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి వినతులు ఇచ్చేందుకు ప్రజలు క్యూ కట్టారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, సాగునీటి సమస్యలపై వినతులు ఇచ్చారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బేబినాయన చెప్పారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి సోమవారం అన్నదానం చేస్తారు. 400 వారాలు పూర్తి చేసుకోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. రోగులు, బంధువులకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు అన్నదానం చేశారు. పేదల ఆకలి తీరుస్తున్న నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బొంగు సంతోష్ కుమార్‌ను అభినందించారు. నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, శ్రీ శ్రీనివాస కరస్పాండెంట్ బొంగు గౌరీ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రోగుల నుండి విశేష స్పందన లభించింది.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలకి సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు బి.పైడిరాజు వి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పేద కుటుంబాలకు చెందిన వారేనని, వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం రూ.12వేల ఆదాయం లోపు ఉన్న వారంతా సంక్షేమ పథకాలకు అర్హులేనని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్‌కు రూ.11,500, హెల్పర్లకు, మినీ వర్కర్లకు రూ. 7వేలు గౌరవ వేతనం ఇస్తున్నందున అందరికీ పథకాలు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని అడుగుతుంటే తల్లికి వందనం, రేషన్ కార్డులు, రిటైర్ అయిన తర్వాత పెన్షన్, వితంతు పెన్షన్ వంటివి ఇవ్వడం లేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలైనా అమలు చేయాలి, లేదా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సౌకర్యాలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర బిఆర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ప్రభావతి, సునీత, మాధవి, రేణుక, పుష్ప మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం వర్తింపజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల, కామేశ్వరి, సెక్టార్ లీడర్లు అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

ఎస్‌కోట: తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతినిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్నిటిని మండలంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింపచేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాడంగి: అంగన్వాడీలకి సంక్షేమ పథకాల అమలు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమరవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిటి ధనంకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లికి వందనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు రవణమ్మ, నాయకులు సీత, కృష్ణవేణి, పార్వతి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గాడి అప్పారావు, కాకర తులసి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు, మినీ వర్కర్లందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అంగన్వాడి వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీలు తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ నాయకురాలు డి. శ్యామల మాట్లాడుతూ అంగన్వాడీలకు తల్లికి వందనం ఇవ్వాలని, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుశీల, మాణిక్యం జైశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

విజయనగరం: నిరసన తెలుపుతున అంగన్‌వాడీ కార్యకర్తలు

చీపురుపల్లి: అంగన్వాడీల్లో వర్కర్లు, హెల్పర్లుగాను పనిచేస్తున్న వారి పిల్లలకు ప్రభుత్వ అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ఇవ్వాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు స్థానిక తహశీల్దార్ ఏ కాంతంకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి.నాగమణి, లత పాల్గొన్నారు.

వంగర: అంగన్వాడీలకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, తల్లికి వందనం పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం పిలుపుమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు హరి రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రూపవతి, భారతి, సునీత, జయమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

పట్టణాల పరిశుభ్రత, ప్రజారోగ్యం పర్యవరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనంతో సహ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలో నివసిస్తున్న కోటిన్నర మంది ప్రజల అవసరాలను తీరుస్తూ ప్రజా ఆరోగ్యం, పర్యావరణంను కాపాడ టంలో సుమారు 48 వేల మంది మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. ఇతరుల ఎవరూ చేయలేని విధులను అనేక కష్టనష్టాలు కోర్చి వీరు నిర్వహిస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలు, నిరంతరం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల సరుకులు ధరలు, కరెంటు చార్జీలు వీరిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయన్నారు. ఈ దుర్భర పరిస్థితుల్లో కనీసం తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేసి కార్మికులకు కొంతైనా ఊరటనివ్వాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందించారు. సిఐటియు మండల నాయకులు ఎస్ గోపాలం, పద్మ, ప్రసాదు, సాంబ, పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సిఎం సహాయ నిధితో భరోసా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - లక్కవరపుకోట

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం సహాయనిధితో భరోసా అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ క్యాంపు కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు రూ.24.19 లక్షల చెక్కులను అందించారు. ఆమె మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన పేదవారికి సీఎం సహాయనిధి ఎంతగానో భరోసా ఇస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం తరపున పేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం, డిప్యూటీ సిఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, కొత్తవలస ఎఎంసి చైర్మన్ నాయుడు, కొత్తవలస మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, కొట్టాడా ఈశ్వరరావు, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

చెత్తపార్కును పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - బొబ్బిలి

రామన్నదొరవలస సమీపంలో ఉన్న మున్సిపల్ చిత్తశుద్ధి పార్కును కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కులో ఉన్న మిక్సడ్ వేస్ట్‌ను బెడ్లను క్లియర్ చేయడంలో భాగంగా జిందాల్ పవర్ ప్లాంట్, విశాఖపట్నం వారికి పంపడానికి చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇనస్పెక్టర్‌కు ఆదేశించారు. తడి చెత్తను ప్రాసెస్ చేసే విధానాన్ని, పొడి చెత్తను గ్లాస్, పేపర్, క్లాత్ అట్టలుగా వేరు చేయు ప్రాసెస్‌లను పరిశీలించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా చెత్తను క్లియర్ చేయించి వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కులో ఉన్న ఖాళీ స్థలంలో పూలు, పండ్ల మొక్కలను నాటేందుకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

10 మంది జూదగాళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొల్లాయివలస గ్రామ సమీపంలో మామిడి తోటలో పేకాట ఆడుతున్న 10 మంది జూదగాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట పై దాడులు నిర్వహించిన పోలీసులు వారి వద్ద నుండి రూ.14,210 నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు, తొమ్మిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గ్రామస్తులు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా కట్టడి చేయాలని ఎస్ఐ దుర్గాప్రసాద్ హెచ్చరించారు.

ఉపాధి కూలీల సంతకాల సేకరణ

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని పురిటిపెంట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు వద్ద సంతకాలు సేకరణ చేసి పురిటిపెంట సచివాలయం సిబ్బంది మహిళా పోలీస్ వాసంతి, డిజిటల్ అసిస్టెంట్ అలేఖ్యకు పెండింగ్ బకాయిలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 8 వారాలగా ఉపాధి బకాయిలు పెండింగ్‌లో ఉంచడం వల్ల ఉపాధి వేతన దారులు చాలా ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. వర్షాకాలం వచ్చేసింది వంద రోజులు పని లక్ష్యం పూర్తి కాలేదని, ఏటా ఈ మాదిరిగానే ఉంటుంది కావున పని కావాల్సిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని పూర్తయ్యే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలంటే బడ్జెట్‌లు పెంచాలన్నారు. 200 రోజులు పని ఇవ్వాలని, 600 రూపాయలు కూలితో పాటు వేసవి అలవెన్స్ ఇవ్వాలని, మేట్లకు ప్రోత్సా హకాలు ఇవ్వాలని, ఒక పూటే పని పెట్టి పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దాసరి సింహాద్రి, తుంపిల్లి అప్పలనాయుడు, మంత్రి లక్ష్మి, జొన్నాడ చిన్నమ్మ, సత్య, గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

మెంటాడ: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని జిల్లా కౌలు రైతుల సంఘ సహాయ కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గత 12 వారాలుగా కూలీలు పనులు చేపట్టినప్పటికీ బకాయిలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, 600 రూపాయలు రేటు పెంచాలని, పనిముట్లు కూలీలకు అందించాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఒ ఏ.భానుమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో గిరిజన శాఖ మండల కార్యదర్శి టి సోములు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే భవిష్యత్తుకు పునాది

-న్యాయమూర్తి విజయ్ రాజ్ కుమార్

ప్రజాశక్తి- మెంటాడ

తల్లిదండ్రులు విద్యావంతులు కాకపోయినప్పటికీ నేటి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే వారికి చక్కటి భవిష్యత్తు ఉంటుందని గజపతినగరం సివిల్ కోర్ట్ జడ్జి విజయ్ రాజ్ కుమార్ అన్నారు. వివిధ హాస్టల్స్ సందర్శనలో భాగంగా సోమవారం ఆంధ్ర గిరిజన ఆశ్రమ పాఠశాలను సోమవారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో గల పడక గదులు, బాత్‌రూములు, వంట గది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హాస్టల్‌కు సంబంధించిన సమస్యలను, విద్యార్థులకు సంబంధించిన వివిధ రకాల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చదువు కలిగి ఉంటే ప్రపంచంలో ఎక్కడకైనా వెళ్లి బతకవచ్చని మన పూర్వీకులకు ఎవరి ప్రోత్సాహం లేకపోవడంతో వాళ్లు వెనకబడ్డారని ఇప్పుడు గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ చదువుకోడానికి ఎంతో ప్రోత్సహిస్తుందని తెలిపారు. మన తెలివితేటలకు చదువు తోడై ఉంటే మంచి జీవితం దొరుకుతుందని క్రమశిక్షణ లేకుండా ఎంత జ్ఞానవంతుడైన ఎంత తెలివైన వాడైనా ఉన్నత స్థాయిలో నెగ్గుకు రాలేడని చక్కగా చదువుకొని అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన కొన్ని సమస్యలను హెచ్ఎం జి కృష్ణారావు న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా వాటన్నిటిని పరిష్కరించే విధంగా ఉన్నత స్థాయిలో నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కె.సాయిశేఖర్, కోర్టు సిబ్బంది ఆదిలక్ష్మి, పిఎల్‌విలు జి జయబాబు, ఆర్ నాగమణి, బి ప్రసన్నలక్ష్మి, వార్డెన్ పి అప్పారావు, ఉపాధ్యాయులు జి శివ, ఎన్ మనోరంజని, వై జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
E.P.3/21 OS 94/19

రొంగల అప్పలనాయుడు ......DHr
మిత్తిరెడ్డి శ్రీనివాసరావు ....JDr

వేలం ప్రకటన

పై నెంబరు అమలలో డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం JDr యొక్క యీ క్రింది వివరించిన సర్వే నెంబర్లులో గల ఆస్తిపై కోర్టులో తే 26-06-2025దీన ఉదయం గంటలు 10-30 నుంచి సాయంత్రం 5 గం॥ వరకు వేలం వేయబడును. వేలాంలో పాల్గొనదలచినవారు సదరు దినం హాజరై వేలాం పాడుకోవలసినదిగా యీ ప్రకటన మూలంగా తెలియపర్చడమైనది.

షెడ్యూలు వివరములు

విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, దత్తిరాజేరు గ్రామ పరిధిలో JDr కు గల భూమి యొక్క వివరములు.

1. ప్రతి. ఖతా నెంబరు 912 సర్వే నెంబరు 85/118 విస్తీర్ణం ఎ. 0.15 సెంట్లు మెట్టు భూమి
2. ప్రతి. ఖాతా నెంబరు 912 సర్వే నెంబరు 85/124 విస్తీర్ణం ఎ. 0.07 సెంట్లు పల్లం భూమి

DHr విలువ :రూ. 3,30,000/-
అమీన్ విలువ :రూ. 1,16000/-

తొత్తడి దేవుడు
న్యాయవాది,
గజపతినగరం